# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 52 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 13, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఏచూరి మరణంపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

హైదరాబాద్,(నమస్తే ఉదయం): ప్రముఖ రాజకీయవేత్త, వామపక్ష యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. సీతారాం ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయక మని అన్నారు. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగుపెట్టిన ఏచూరి దాదాపు నాలుగు దశాబ్ధాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి అన్నారు. రాజ్య సభ ఎంపీగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా,సామాజిక కార్యకర్తగా ఆయన దేశంలో అందరికీ సుపరిచితుడ య్యారని.. ఆయన లేని లోటు పూడ్చలేనిదని అన్నారు.







### పార్టీ ఫిరాయింపులపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం

### గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానన్న కౌశిక్..

### ఆయన విల్లాకు వెళ్లిన గాంధీ, ఆయన అనుచరులు

### టమాటాలు, కోడిగుడ్లతో దాడి, కిటికీలు, కుండీలు ధ్వంసం..

### ప్రతిగా చెప్పులు విసిరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

### గంటన్నరపాటు హైటెన్షన్.. గాంధీ అరెస్టు, విడుదల..

### సైబరాబాద్ కమిషనరేట్‌కు హరీశ్, కౌశిక్.. ఫిర్యాదు

### గాంధీపై కేసు నమోదు చేయాలని బైఠాయింపు..

### వారిని అరెస్టు చేసి కేశంపేట తీసుకెళ్లి వదిలిన పోలీసులు

### ఇది ప్రభుత్వ దాడి.. పోలీసుల వైఫల్యం: హరీశ్‌రావు..

### నేడు గాంధీ ఇంటిని ముట్టడిస్తాం: కౌశిక్

### ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న కౌశిక్

### అరెకపూడి.. గాంధీ, అనుచరులపై కేసు నమోదు

## అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య

# జెండా జగడం

హైదరాబాద్,సెప్టెంబర్12,(నమస్తే ఉదయం):
పార్టీ ఫిరాయింపుపై రచ్చ రచ్చ! ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం! ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి పార్టీ మారిన మరో 'బీఆర్ఎస్' ఎమ్మెల్యే! అక్కడ హై టెన్షన్ వాతావరణం! ఆయన అరెస్టు.. విడుదల! సీనులోకి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు! సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం వద్దా తీవ్ర ఉద్రిక్తత! అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు! వెరసి.. ఫిరాయింపులు, 'జెండా వివాదం' ఎమ్మెల్యేల మధ్య తీవ్రస్థాయి లొల్లికి దారి తీసింది! శేరిలింగంపల్లి రణరంగంగా మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

### నీ కాలనీకొచ్చా.. నీ ఇంటికొచ్చి.. అరికెపూడి గాంధీ

కౌశిక్ రెడ్డి గేటెడ్ కమ్యూనిటీలోకి వెళుతున్నప్పుడు మధ్యలో ఎమ్మెల్యే గాంధీని పోలీసులు అడ్డుకున్నారు. ఆయన అక్కడే బైఠాయించి కౌశిక్‌పై మరోసారి తీవ్రంగా మండిపడ్డారు. తన ఇంటికి వస్తానని చాలెంజ్ చేసిన కౌశిక్ రెడ్డి రాలేకపోయాడని, తానే ఆయన ఇంటికి వచ్చానని చెప్పారు. "దమ్ము, ధైర్యం ఉంటే బయటకు రా. నీ ఇంటికి వచ్చా.. నీ కాలనీకి వచ్చా" అని మరోసారి సవాల్ విసిరారు. పోలీసులు అరెస్ట్ చేసిన తర్వాత కూడా ఆయన మాట్లాడారు. బీఆర్ఎసలోకి వచ్చినప్పటి నుంచీ కౌశిక్ రెడ్డి తీరు సరిగా లేదని, ఆయన తీరు వల్లే ఆ పార్టీ ఓటమి పాలైందని విమర్శించారు. ఆయన పెద్ద కోవర్టు అని.. పార్టీలో జరిగిన అంతర్గత చర్చలను బాత్ రూమ్‌కు వెళ్లి వేరే వారికి చెప్పేవాడని మిగతా..2లో

### బతకడానికొచ్చిన ఆంధ్రోళ్లు: కౌశిక్‌రెడ్డి

తన ఇంటిపై గాంధీ అనుచరులు దాడి చేయడంతో ఆంధ్ర, తెలంగాణ అంశాన్ని కౌశిక్ రెడ్డి తెరపైకి తెచ్చారు. బతకడానికి వచ్చిన ఆంధ్రోళ్లు తెలంగాణ బిడ్డలపై దాడి చేస్తే ఊరుకునేది లేదని, తెలంగాణ పౌరుషం ఏమిటో శుక్రవారం చూపిస్తామని హెచ్చరించారు. నాలుగేళ్ల తర్వాత కేసీఆర్ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు నీ భరతం పడతానని, సినిమా చూపిస్తానని గాంధీని హెచ్చరించారు. కాగా, కౌశిక్ రెడ్డి హెచ్చరికల నేపథ్యంలో గాంధీ ఇంటి వద్ద పోలీసులు పటిష్ఠ భద్రత, బారికేడ్లు ఏర్పాటు చేశారు.





## 17న ప్రజాపాలన దినోత్సవం

### పబ్లిక్ గార్డెన్‌లో జెండా ఆవిష్కరించనున్న సిఎం

### ఏర్పాట్లను సమీక్షించిన సిఎస్ శాంతికుమారి

హైదరాబాద్,సెప్టెంబర్12(నమస్తే ఉదయం): తెలంగాణ విమోచన దినం..సందర్భంగా ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఉదయం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లపై అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్షించారు. ప్రజా పాలన దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవమైన 17వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా మిగతా..2లో

## రైతుల ఉసురు తీస్తున్న కాంగ్రెస్

### మరోమారు విమర్శలు గుప్పించిన కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్12(నమస్తే ఉదయం): అధికార కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. రుణమాఫీ కాలేదని కొందరు.. రైతు భరోసా అందక ఇంకొందరు అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా మారినా.. కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడటం లేదంటూ బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రైతును రాజు




చేస్తే.. ఈ కాంగ్రెస్ సర్కార్ అన్నదాతల ప్రాణాలను తీస్తుందంటూ ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీ బోగస్.. రైతు భరోసా కూడా బోగస్ అంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇటు బ్యాంకులు, ఇటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో మేడ్చల్‌లో వ్యవసాయ కార్యాలయం సాక్షిగా రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. తన తల్లికి, తనకు ఉన్న రుణం మాఫీ కాకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దగాకు బలైపోయాడని కేటీఆర్ తెలిపారు. భార్యాభర్తలిద్దరిలో ఒక్కరి కూడా రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో జగిత్యాలలో పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టా డుతున్నాడు రైతు సాగర్ రెడ్డి. తన పేరిట ఉన్న లక్షన్నర రుణం, తన భార్య పేరిట ఉన్న లక్షా 60 వేల రుణంలో ఏ ఒక్కరి రుణం మాఫీ అయినా గట్టెక్కుతానని గంపెడాశలు పెట్టుకుని దారుణంగా మోసపోయాడని కేటీఆర్ పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చేసిన తీరని ద్రోహానికి ఇంకా ఎంతమంది రైతులు ప్రాణాలను బలిపెట్టాలి.. ఏకకాలంలో అందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ అని మిగతా..2లో

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యాచార ఘటనలు

### ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటోంది

### ఘాటుగా విమర్శలు గుప్పించిన రాహుల్



న్యూఢిల్లీ,సెప్టెంబర్12(నమస్తే ఉదయం): బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యాచార ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నా ఆ పార్టీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని లోక్‌సభపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో ట్రైనీ ఆర్మీ మహిళపై జరిగిన అత్యాచార ఘటనను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'ట్రైనీ ఆర్మీ అధికారులపై దాడి, వారి స్నేహితురాలిపై అత్యాచారం సమాజాన్ని సిగ్గుపడేలా చేసింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో శాంతిభద్రలు కరవ-య్యాయి. మహిళలపై రోజురోజుకు పెరుగుతోన్న నేరాలపట్ల బీజేపీ ప్రదర్శిస్తోన్న ప్రతికూల వైఖరి ఆందోళన కలిగిస్తోంది. అధికార యంత్రాంగం వైఫల్యం వల్లే నేరస్థులు ఇలాంటి పనులకు పూనుకుంటు న్నారు. ఈ నేరాలు అమ్మాయిల స్వేచ్ఛ, ఆకాంక్షలకు అడ్డంకిగా మారతాయి. దేశ జనాభాలో సగ భాగమైన ఆడపిల్లలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ఇంకా ఎంతకాలం కళ్లుమూసుకొని ఉంటారని రాహుల్ ప్రశ్నించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్మీ అధికారులు మోవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్నారు. అధికారులు ఇద్దరూ మధ్యాహ్న సమయంలో మహిళా స్నేహితులతో కలిసి ఛోటీ జామ్‌లోని ఫైరిరగ్ రేంజ్‌కు వెళ్లారు. అయితే వారిని అకస్మాత్తుగా 8 మంది వ్యక్తులు పిస్టల్స్, కత్తులు, కర్రలతో చుట్టుముట్టారు. డబ్బు, నగలు, వస్తువులు దోచుకోవడానికి వచ్చిన దుండగులు ఇద్దరు ట్రైనీ అధికారులను దారుణంగా కొట్టారు. ఒక ఆఫీసర్‌ని, ఒక మహిళను బందీలుగా మార్చుకున్న దుండగులు.. మరో అధికారిని, ఒక మహిళను వదిలిపెట్టి రూ.10 లక్షలు తీసుకొచ్చి బందీలుగా ఉన్నవారిని విడిపించుకోవాలని డిమాండ్ చేశారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఢిల్లీ జర్నలిస్టులతో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(నమస్తే ఉదయం): జర్నలిస్టుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలకు ఢిల్లీ తెలుగు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. .ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న తెలుగు జర్నలిస్టులు న్యూ ఢిల్లీలో పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డి ని గురువారం కలిశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలకు గాను ఢిల్లీ జర్నలిస్టుల బృందం ఈ సందర్భంగా సీఎం రేవంతరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎంతో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాత్రికేయుల ఇండ్లు, హెల్త్ కార్డ్స్, అక్రిడేషన్ల గురించి చర్చించారు. ముఖ్యంగా మీడియా అకాడమీకి రూ. పదికోట్లు ప్రకటించినందుకు జర్నలిస్టుల ప్రతినిధి బృందం హర్షం వ్యక్తం చేసింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత కోసం తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వ్యవస్థలో జర్నలిస్టులు కీలకమని, బాధ్యతాయుతమైన రిపోర్టింగ్‌కు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## సీతారాం ఏచూరి కన్నుమూత

న్యూఢిల్లీ,సెప్టెంబర్12(నమస్తే ఉదయం):
సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి(72) కన్నుమూశారు. ఊపిరితిత్తుల్లో తీవ్ర ఇన్ఫెక్షన్తో ఢిల్లీలోని ఎయిమ్స్ చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. ఆయన మరణ వార్త విని దేశ నలుమూలల నుంచి సీపీఎం నేతలు ఢిల్లీకి చేరుకుంటున్నారు. ఏచూరి కమ్యూనిస్ట్ పార్టీకి ఒక ఐకాన్ గా వెలుగొందారు. తొలుత ఒక జర్నలిస్టుగా పనిచేసి, అంచలంచెలుగా దేశస్థాయి రాజకీయ నాయకుడిగా ఎదిగి, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాగొంతుకలా తన జీవితాంతం పనిచేశారు.

# కౌశిక్ రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకో

**- కాంగ్రెస్ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి**

**కొత్తకోట, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నుండి చీరలు, గాజుల సాంస్కృతి మొదలవ్వాలి నాడు కాంగ్రెస్ పార్టీని వీడి టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి నుండే చీరలు గాజులు సంస్కృతి మొదలవ్వాలిని వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తకోట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన



విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... టిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలు గాజులు, చీరలు వేసుకోవాలన్న కౌశిక్ రెడ్డి మాటలు పై శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు.
గత అసెంబ్లీ ఎన్నికలలో భార్యను, కూతుర్ని అడ్డుపెట్టుకొని "కౌశిక్ రెడ్డి శవయాత్ర"రాజకీయం చేసి గెలిచిన నువ్వు ఇతర ఎమ్మెల్యేలను గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.
గత కేసీఆర్ ప్రభుత్వం 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అంగట్లో పశువుల్లాగా బర్లలాగా ఉన్నందుకు ముందు కేటీఆర్, హరీష్ రావుకు గాజులు, చీరలు అందించాలని అన్నారు. ఇతర పార్టీల నాయకులు చేరికతోనే టిఆర్ఎస్ పార్టీ పుట్టిందని, కెసిఆర్ రాజకీయ పుట్టుక ఎక్కడుందో చూసుకోవాలని అన్నారు
కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు.
10 ఏళ్లపాటు కిరాయింపులను ప్రోత్సహించిన కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావులకు ఏం పంపుతావని ప్రశ్నిస్తున్నాను.
కౌశిక్ రెడ్డిపై తక్షణమే కేసు నమోదు చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని శాసనసభ స్పీకర్ ను కోరారు.

## రైతుల ఉసురు తీస్తున్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన మాటతప్పిన సీఎంను ఏం చేయాలి.. డిసెంబర్‌లో పెట్టిన డెడ్ లైన్ సెప్టెంబర్ దాటినా అమలుకాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఇంకా ఎవరికి చెప్పుకోవాలి..? రూ.49,500 వేల కోట్ల రుణమాఫీలో పావుశాతం కూడా చేయకుండా చేతులెత్తేసినందుకు రైతన్నలకు క్షమాపణలు చెప్పాలి రేవంత్ సర్కార్. ఇంకెంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే మీ కళ్ళు చల్లారుతాయి? రేవంత్ రెడ్డి ఢిల్లీ యాత్రలు చేయటం కాదు రాష్ట్రం లో ఏం జరుగుతుందో చూడు.. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దు.. ధైర్యంగా ఉండాలని కోరుతున్నాను అని కేటీఆర్ తెలిపారు.

## 17న ప్రజాపాలన దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను సి.ఎస్. ఆదేశించారు. సభా స్థలంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్వానితుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం, శానిటేషన్, పీఏ సిస్టం, భద్రతా తదితర ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. 17న గణేశ్ నిమజ్జనం ఉన్నందున ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ట్రాఫిక్ నియంత్రణ, తగు మార్గాలను ముందస్తుగా తెలియచేయాలని నగర పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు.








# రాజేంద్రనగర్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** ఉపాధ్యాయ దినత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాజేంద్రనగర్ మండల ఉత్తమ ఉపధ్యాయులుగా ఎన్నికైన ముక్కెర రాజు, (శ్రీ మేధా హై స్కూల్ )సునీల్ కుమార్ (కాకతీయ గ్రూప్ అఫ్ స్కూల్) మంజు భార్గవి (అక్షర స్కూల్)లను ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో మండల విద్యా అధికారి, నోడల్ ఆఫీసర్ ట్రస్మ జనరల్ సెక్రెటరీ బాబు రావు,స్కూల్ కరస్పాండెంట్ సోమ శ్రీనివాస్ , కర్ణాకర్, నర్సింహా రెడ్డిలు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మరణం తీరని లోటు: పి శ్రీనివాసులు నాయుడు

**హైదరాబాద్, సెప్టెంబరు 12(నమస్తే ఉదయం):** కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మరణం తీరనిలోటని కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్ నాయుడు కొనియాడారు. గురువారం భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో సీతారాం ఏచూరి తెలంగాణ సాయుధ పోరాటానికి భావోద్వేగపూరిత స్థానం ఉంది. చరిత్రను పోరాటానికి ముందు అనీ, పోరాటం తర్వాత అనీ గుర్తిస్తాం. అలాంటి పోరాట కాలం నాటి నాయకులుకు వారసులుగా ప్రస్తుత తరం నాయకులు అక్కడ సిపిఎం లోను , ఇక్కడ సిపిఐ లోనూ బాధ్యతలను అంది పుచ్చుకున్నారు.
ఆ కోవకు చెందిన వారిలో కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ప్రముఖ స్థానం వుంటుందన్నారు.తన ఉద్యమ ప్రస్థానాన్ని ఎస్ ఎఫ్ ఐ నాయకుడిగా ప్రారంభించి పార్టీ ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. కామ్రేడ్ ఏచూరి పార్టీ జయాపజయాలకు బాధ్యుడయ్యారు. తన హయాంలో పార్టీని ఐక్యంగా నడిపించడంలో జయప్రదం అయ్యాడు.
పలు భాషలు అనర్గళంగా మాట్లాడుతూ... అందరితోనూ కలవిడిగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో స్నేహశీలిగా గుర్తింపు పొందారు. రాజ్యసభలో మంచి వక్తగా స్థానం ఏర్పరచుకున్నారు. దేశంలో వామపక్ష ఉద్యమం అత్యంత గడ్డుకాలంలో ప్రయాణిస్తున్న ఈ దశలో ఆయన అర్థాంతర నిష్క్రమణ నిస్సందేహంగా పెద్ద లోటే అన్నారు.

# అరికెపూడి నీకు దమ్ముంటే కాంగ్రెస్‌లో చేరినట్లు నిజాయితీగా ప్రకటించి రాజీనామా చేయాలి

**- బూర్కుంట సతీష్ డిమాండ్**

**శంషాబాద్, సెప్టెంబర్ 12( నమస్తే ఉదయం):** టిఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కీ ధైర్యం నిజాయితీ ఉంటే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు అంగీకరించి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని శంషాబాద్ మండల మాజీ జెడ్పిటిసి సభ్యుడు రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్ బూర్కుంట సతీష్ డిమాండ్ చేశారు. గురువారం శంషాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శేర్లింగంపల్లి నుండి టిఆర్ఎస్ పార్టీపై గెలిచి ఇటీవలే కాంగ్రెస్‌లో



చేరినట్లు ప్రకటించిన అరికపూడి గాంధీ మళ్లీ మాట మార్చి తాను పార్టీలో కొనసాగుతున్ననని పేర్కొంటూనే పాడి కౌశిక్ రెడ్డిపై దాడికి పాల్పడడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు.
ఆయనకు ఏ మాత్రం నీతి నిజాయితీ ఉన్న రాజ్యాంగంపై నమ్మకం ఉంటే కే శరతుగ తన పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధం కావాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ పై గెలుస్తానని ధైర్యం ఉంటే ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి పై దాడి చేస్తే తాము చూస్తూ ఊరుకోమని తెలంగాణలో తిరగకుండా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కూచిరెడ్డి శంకర్ రెడ్డి. నందిగామ రాజశేఖర్ గౌడ్. చిన్న గండు రాజేందర్. వీరమల్ల హనుమంతు. చలివేంద్రి వెంకట్ రెడ్డి.రమేష్. జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య జెండా జగడం

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం తీవ్రంగా స్పందించారు. "పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి. లేదంటే ఆ పది మందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి" అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెసలో చేరినట్లు అప్పట్లో స్వయంగా చెప్పిన గాంధీ ఇప్పుడు దేవుడి కండువా కప్పుకొన్నానని మాట మారుస్తున్నాడని, ఆయన తమ పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే, గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ భవన్‌కు తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఉదయం ఏడు గంటలకే కౌశిక్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు.

### గేటును విరగ్గొట్టి.. తలుపులు నెట్టి..

తన ఇంటికి వచ్చి జెండా ఎగరేస్తానని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంపై గురువారం ఉదయం అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. తన ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుని మీడియాతో మాట్లాడారు. రాయలేని పదజాలంతో కౌశిక్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. "నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని అసెంబ్లీలో స్పీకర్ ప్రకటించారు. కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. 11 గంటలకు నా ఇంటికి వచ్చి జెండా ఎగుర వేస్తానన్నాడు. రాకపోతే 12 గంటలకు నేనే నీ ఇంటికి వస్తా. పార్టీలో చేరి భ్రష్టు పట్టించింది కాక పాత ముఖ్యమంత్రిని నాశనం చేశావు. కాంగ్రెస్ నుంచి కొంతమందిని తీసుకొచ్చి బీఆర్ఎసలో జాయిన్ చేస్తానని చెప్పావు. ఓ దుర్మార్గుడు నా ఇంటిపై జెండా ఎగరవేస్తానని అంటే ఊరుకుంటానా!? నా ఇంటిపై జెండా ఎగుర వేస్తానంటే ఎగుర వేయించుకునేందుకు సిద్ధంగా లేము. చేతులు కట్టుకుని కూర్చోలేదు. నువ్వో.. నేనో తేల్చుకుందాం.. ధైర్యం ఉంటే రా..! లేకపోతే నేనే వస్తా" అని సవాల్ విసిరారు. ఇది బీఆర్ఎసకు, తనకు మధ్య యుద్ధం కాదని, కౌశిక్‌కు తనకు మధ్యనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తనను గెలిపించకపోతే చనిపోతానని బ్లాక్ మెయిల్ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన





కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కేసీఆర్‌కే తాను సమాధానం చెబుతానని, కౌశిక్ వంటి ఇజ్జత్ లేని వాళ్లకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పది నిమిషాల్లో రాకపోతే తానే కౌశిక్ ఇంటికి వెళతానని అన్నారు. అన్నట్లుగానే మధ్యాహ్నం 12 గంటలకు 20 వాహనాల కాన్వాయ్‌లో తన అనుచరులతో కొండాపూర్‌లోని కొల్లా విల్లాసలో ఉంటున్న కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లారు. దీంతో, కౌశిక్ ఇంటి వద్ద భద్రతను మరింత పెంచారు. మధ్యాహ్నం 12.30 గంటలలోపు కౌశిక్ రెడ్డి ఇంటికి గాంధీ, ఆయన అనుచరులు చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇరు వర్గాల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. కొంతమంది గేటును విరగ్గొట్టి, ప్రవేశ ద్వారానికి చెందిన తలుపులను తెరిచేందుకు ప్రయత్నించారు. విల్లాస్ బయట ఉన్న పెద్ద గేటును బద్దలు కొట్టి గాంధీ అనుచరులు లోపలికి వెళ్లారు. కానీ, వారు కౌశిక్ రెడ్డి దగ్గరకు వెళ్లనీయకుండా పోలీసులు కట్టడి చేశారు. అదే సమయంలో కౌశిక్, ఆయన అనుచరులపై గాంధీ అనుచరులు కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారు. కొంతమంది రాళ్లతో ఆయన ఇంటి కిటికీ అద్దాలు, పూలకుండీలు పగులకొట్టారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై చెప్పులు విసిరారు. సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు గాంధీని అరెస్ట్ చేసి నార్సింగి పోలీసు స్టేషన్‌కుతీసుకెళ్లారు. ఆ తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

### గాంధీ, అనుచరులపై కేసు నమోదు

కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి కేసులో గచ్చిబౌలి పోలీసులు ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిలో గాంధీని ఎ-1గా పేర్కొన్నారు. గాంధీతోపాటు కార్పొరేటర్లు, కార్యకర్తలు 30 మందిపై కౌశిక్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నంబర్ 1392/2024 నమోదు చేశారు. 189, 191(2), 191(3). 61, 132, 329, 111, 324(4), 324(5), 351(2), ఆర్-డబ్ల్యూ 190 డీఎన్ఎస సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎ2గా మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, ఎ3గా బి.గౌతంగౌడ్, ఎ4 రాంపల్లి వెంకటేష్, ఎ5 జి.రాములు, ఎ6 నరేష్, ఎ7 శివ, ఎ8 రాధిక, ఎ9 మంజుల, ఎ10 చంద్రికగౌడ్, ఎ11 కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎ12 బి.వెంకటేష్ గౌడ్, ఎ13 అష్రఫ్, ఎ14 రఘునాథ్‌రెడ్డి, ఎ15 మోహన్ గౌడ్‌తోపాటు పలు వీడియోలు పరిశీలించి దాడిలో పాల్గొన్న పలువురిని గుర్తించి 30 మందిపై కేసు నమోదు చేశారు.. మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం తీవ్రంగా స్పందించారు. "పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి. లేదంటే ఆ పది మందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి" అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెసలో చేరినట్లు అప్పట్లో స్వయంగా చెప్పిన గాంధీ ఇప్పుడు దేవుడి కండువా కప్పుకొన్నానని మాట మారుస్తున్నాడని, ఆయన తమ పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే, గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ భవన్‌కు తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఉదయం ఏడు గంటలకే కౌశిక్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు.

### పోలీసుల వైఫల్యం వల్లే దాడి: హరీశ్‌రావు

పోలీసుల వైఫల్యం వల్లే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. గాంధీ, ఆయన అనుచరులు కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేశారన్న వార్తలు తెలుసుకుని పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన నివాసానికి చేరుకున్నారు. అక్కడ, సీపీ ఆఫీసు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. మీరు ఒకటి చేస్తే తాము రెండు చేయగలమని హెచ్చరించారు. పైలట్, ఎస్కార్ట్ ఇచ్చి మరీ గాంధీని కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడికి పంపారని, ఈ చర్యను ఖండిస్తున్నామని అన్నారు. తమ ఎమ్మెల్యేను కాంగ్రెసలోకి చేర్చుకోవడమే కాకుండా... వారిని ఉసిగొల్పి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి చేయించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. కౌశిక్ రెడ్డికి సీఎం రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. "హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతినవద్దని కోరుకుంటున్నాం. గతంలో తెలంగాణ పోలీసులు దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నారు. రేవంత్ ప్రభుత్వం పోలీసులను వారి పని వారిని చేసుకోనివ్వడం లేదు. కౌశిక్ ఇంటిపై దాడి చేసిన గాంధీ, ఆయన అనుచరులపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలి.ద
లేదంటే సీబీఐ విచారణ కోరతాం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం.. కేంద్ర హోం శాఖ వద్దకు వెళ్తాం" అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి డైరెక్షన్లో పోలీసుల ఆధ్వర్యంలో దాడి జరిగిందని, పాత్రధారులు, సూత్రధారులను తేల్చేందుకు విచారణ చేపట్టాలన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, సైబరాబాద్ పరిధిలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని చెప్పారు. "రేవంత్.. నిన్ను హెచ్చరిస్తున్నా.. దాడి చేసిన గూండాలను అరెస్ట్ చెయ్.. వారికి సహకరించిన పోలీసులపై యాక్షన్ తీసుకో.. లేకపోతే ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ ఇంటి ముందు, ఏఐసీసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం"అని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలను ఎలా కొంటున్నరో దేశం మొత్తం తెలిసేలా చేస్తామన్నారు. కాంగ్రెసకు ప్రతిపక్ష హోదా లేకపోవడంతోనే 2018లో ప్రతిపక్ష హోదా ఉన్న ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌కి పీఏసీ చైర్మన్ ఇచ్చామని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్‌ను అడగకుండా, ఎన్నిక లేకుండా నియమించడం దుర్మార్గమన్నారు. "పార్లమెంట్‌లో కేసీ వేణుగోపాల్‌ని పీఏసీ చైర్మన్‌గా ఎన్నుకున్నప్పుడు రాహుల్‌ను అడిగి చేయలేదా!? అదే పద్ధతిలో ఇక్కడా ప్రతిపక్ష నాయకుడిని అడగాలి కదా!" అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని రేవంత్ ప్రయత్నిస్తున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ సమాజంపై దాడి చేస్తే ఊరుకోబోమని, రేవంత్ రెడ్డి భయపెడితే భయపడమని అన్నారు.

## నేడు వందలాదిమందితో గాంధీ ఇంటి ముట్టడి: కౌశిక్

చర్యకు తప్పకుండా ప్రతి చర్య ఉంటుందని, శుక్రవారం ఉదయం 11 గంటలకు వందలాది మందితో గాంధీ ఇంటిని ముట్టడించి తీరతామని, తెలంగాణ పౌరుషాన్ని చూపిస్తామని కౌశిక్ రెడ్డి ప్రకటించారు. "గాంధీని సాదరంగా ఆహ్వానించి, ఇంట్లోకి తీసుకెళ్లి భోజనం పెడదామని భావించాను. ఆయన రౌడీ షీటర్లతో దాడికి పాల్పడ్డాడు. నన్ను హత్య చేయాలని చూశారు. అయినా, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. అసలు తెలంగాణలో శాంతి భద్రతలు ఉన్నాయా లేవా!?" అని ప్రశ్నించారు. ఒక ఎమ్మెల్యేకే రక్షణ ఇవ్వకుంటే.. ఇక సాధారణ ప్రజలకు ఏం ఇస్తారని నిలదీశారు. గాంధీపై పరుష పదజాలంతో దూషించారు. ఆయన టీడీపీని మోసం చేసి బీఆర్ఎసలో.. ఆ పార్టీని మోసం చేసి కాంగ్రెసలో చేరారని, ఇప్పుడు పీఏసీ చైర్మన్ కాగానే బీఆర్ఎసలోనే ఉన్నానని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. గాంధీ చరిత్ర నీచమైనదని విమర్శించారు. "గాంధీగారూ.. నేను వయసులో ఉన్నా. యువకుడిని.. నేను రెచ్చిపోతే ఎలా ఉంటుందో చూస్కో.. నాకు 39, నీకు 65.. లేదు.. తన్నుకుందాం అంటే ఐయామ్ రెడీ! దమ్ముంటే చూసుకుందాం రా" అని సవాల్ విసిరారు. కోట్లకు అమ్ముడుపోయారని, భూ సెటిల్‌మెంట్ల కోసమే కాంగ్రెస్ గూటికి వెళ్లారని ఆరోపించారు. ధైర్యముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెలవాలని, ఎవరి సత్తా ఏమిటో తెలిసిపోతుందని సవాల్ చేశారు. "శుక్రవారం ఉదయం శంభీపూర్ రాజు ఇంటి నుంచి గ్రేటర్‌లోని ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో గాంధీ ఇంటికి వెళ్తాం. బీఆర్ఎసలోనే ఉన్నానని ఆయన అంటున్నందుకే వెళుతున్నాం. అక్కడే బ్రేక్‌ఫాస్ట్.. లంచ్ చేస్తాం.. అక్కడి నుంచి గాంధీని తెలంగాణ భవన్‌కు, కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్తాం" అని వివరించారు.


## నీ కాలనీకొచ్చా.. నీ ఇంటికొచ్చి.. అరికెపూడి గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. తెలంగాణ, ఆంధ్రా అంటూ మళ్లీ ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నాడని ధ్వజమెత్తారు. విద్వేషాలు సృష్టిస్తున్న అతడిని తక్షణమే సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ పార్టీని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి భార్య స్వయంగా విల్లాపై నుంచి తమపై పూల కుండీలు తదితరాలను విసిరారని ఆరోపించారు. కౌశిక్ పిలిస్తేనే తాను వెళ్లానని, అక్కడ తమను 30 మంది అతని అనుచరులు అడ్డుకున్నారని, రాళ్ల దాడి చేశారని ఆరోపించారు.

## అర్ధరాత్రి హరీశ్ బైఠాయింపు

అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరలింపు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. దాదాపు మూడు గంటలపాటు రంగారెడ్డి జిల్లాలో హైడ్రామా నడిచింది. వారిని తొలుత నాటకీయ పరిణామాల మధ్య తలకొండపల్లికి.. అక్కడి నుంచి కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమను ఇంత దూరం ఎందుకు తీసుకొచ్చారో చెప్పాలంటూ హరీశ్ తదితరులు పోలీసు స్టేషన్లోనే బైఠాయించారు. వివాదానికి కారకుడైన గాంధీపై కేసు పెట్టి అరెస్ట్ చేసే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు. కాగా, తోపులాటలో హరీశ్ భుజానికి గాయమైంది. ఆయన చెయ్యి నొప్పితో బాధపడుతున్నట్లు కనిపించింది. చివరకు, డీజీపీ హామీతో హరీశ్ ఆందోళన విరమించారు. కేశంపేట పోలీసు స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత హరీశ్ విలేకరులతో మాట్లాడుతూ.. కౌశిక్ ఇంటిపై దాడి చేసిన వారిపై 307 కింద క్రిమినల్ కేసు పెడతామని డీజీపీ హామీ ఇచ్చారని, బేషరతుగా ఇంటికి వెళ్లాలని చెప్పారని, అందుకే ఆందోళన విరమించామని చెప్పారు. మరోవైపు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద, సంజయ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ స్పీకర్ మధుసూదనాచారిలను మరో వాహనంలో తలకొండపల్లికి తీసుకొచ్చారు. అక్కడ భారీగా



మోహరించిన బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేయడంతో 20 నిమిషాల అనంతరం తలకొండపల్లి నుంచి వారిని నగరం వైపు తీసుకెళ్లారు. బీఆర్ఎస్ శ్రేణులు అడుగడుగునా అడ్డుకోవడంతో అర్ధరాత్రి కేశంపేట, తలకొండపల్లిల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. షాద్‌నగర్ బైపాస్ మీదుగా కేశంపేట్ తరలిస్తుండగా ఎక్లాసఖాన్‌పేట వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు హరీశ్ ఉన్న పోలీస్ వాహనాన్ని అడ్డుకొని ఆందోళన చేశారు. రోడ్డుకు అడ్డుగా జేసీబీ పెట్టి పోలీసు వాహనాలను అడ్డుకున్నారు. వాహనం అద్దాలను పగులగొట్టారు.

## యువకుడి ఉరి వేసుకుని ఆత్మహత్య



**గద్వాల,సెప్టెంబర్12(నమస్తే ఉదయం):** ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం కేటిదొడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, కేటిదొడ్డి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేటిదొడ్డి గ్రామానికి చెందిన చాకలి సరోజ ఆంజనేయుల దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. వారి కుమారుడు చాకలి వినోద్ (23) వృతిరిత్యా వ్యవసాయం చేస్తుండేవాడు. చాకలి వినోద్ కు మాచర్ల గ్రామానికి చెందిన ఓ యువతితో ఆరునెలల క్రితం వివాహం జరిగింది. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందాడు. గత కొంతకాలంగా మృతుడు మానసిక ఆరోగ్య పరిస్థితులు బాగలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## పురానాపూల్ గల్బ వీధిలో ఘనంగా గణనాథుడు ఉత్సవాలు

**బహదూర్‌పుర, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** పాతబస్తీ పురాణాపూల్ గల్బవీధిలో స్థానిక యూత్ అసోసియేషన్ ఆద్వ ర్యంలో ప్రతిష్టించిన భారీ గణనాథుడు పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 28 అడుగుల ఎత్తు గణనాథుడి ప్రతిమకు భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

## 31,000/- పలికిన పెద్ద షాపూర్ మాత యూత్ అసోసియేషన్ లడ్డు



**శంషాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ గ్రామంలోని మాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ గండి మైసమ్మ టెంపుల్ దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం లడ్డు వేలంపాటలో 31,000 పలికింది. వినాయక చవితి సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించి ఐదు రోజులపాటు భక్తులచే విశేష పూజలు అందుకున్న వినాయకుడి లడ్డును గురువారం నిమజ్జనం సందర్భంగా వేలం వేశారు. గ్రామానికి చెందిన గోపన మోని సంతోష్ యాదవ్ వేలంపాటలో లడ్డూ కైవసం చేసుకున్నాడు. పోటాపోటీగా జరిగిన వేలం పాటలు 31,000 కు లడ్డును ఆయన సొంతం చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పెద్ద షాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ ముదిరాజ్ లడ్డు ఖరీదు చేసిన సంతోష్ యాదవును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాత యూత్ ప్రెసిడెంట్ భాను ప్రకాష్. మాత యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తకోట మండల కేంద్రంలో ఘనంగా వినాయక చవితి పూజలు

**కొత్తకోట,సెప్టెంబర్12 (నమస్తే ఉదయం):** కొత్తకోట మండల కేంద్రంలోని గణేష్ నగర్ లోని రచ్చబండ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన విగ్నేశ్వరుడికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పూజ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ,వేముల సుజాత కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సంవత్సరం ప్రజలందరూ ఆయు రారోగ్యాలతో ఉండాలని, వ్యాపారాలు బాగా జరగాలని, ప్రతి సంవత్సరం జరుపుకునే వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆ విశ్వేశ్వరుడు ఎల్లవేళలా కరుణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో మహిళలు యువకులు చిన్నారులు ఉత్సాహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నాణ్యమైన బోధనలు అందించడమే మా లక్ష్యం

**ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవంలో ఎంఈఓ శంకర్ రాథోడ్ స్పష్టీకరణ**

**దేశంలోని వివిధ రాష్ట్రాలకు విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్నార్న గండిపేట్, రాజేంద్రనగర్ నోడల్ అధికారులు.**

**విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త పోస్టులు, ఖాళీ ఉద్యాయుల భర్తీ అంశం సీఎమ్ దృష్టికి వివిధ సంఘాల నాయకుల వెల్లడి.**



**రాజేంద్రనగర్ , సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉత్తమ బోధనలు అందిస్తూ వారిని ప్రయోజకులను చేయడమే లక్ష్యం కావాలని రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల విద్యాధికారి శంకర్ రాథోడ్ పిలుపునిచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి పై మరింత బాధ్యత పెరుగుతుందని, వారితో పాటు మిగతా వారి సేవలను విద్యాశాఖ తప్పక గుర్తిస్తుందని ఆయన అన్నారు. గురువారం రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాకులుగా ఎంపికైన వారిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ సహకారంతో శ్రీదుర్గా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంగా ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నిరుపేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే ఉంటారని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలోని అందరు విద్యార్థులను సమదృష్టితో ఉత్తమ పౌరులుగా తీర్చదిద్దడానికి మరింత కృషి చేయాలని కోరారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య లేపకపోవడం కొంత ఇబ్బందికరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా ప్రధానోపాధ్యాలు, సబ్జెక్ట్స్ వారిగా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. అంతకు ముందు గండిపేట్, రాజేంద్రనగర్ మండలాల విద్యాశాఖ మండల నోడల్ అధికారులు కె. విజయ్కుమార్, ఎం. కిషన్ మాట్లాడుతూ తమ రెండు మండలాలు ఒక మిని భారత దేశంగా అభివర్ణించారు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉపాధికోసం ఇక్కడ వచ్చి కూలీనాలి చేసుకుంటూ వారి పిల్లలను మాత్రం ప్రభుత్వ స్కూళ్ళకు పంపుతారని చెప్పారు. దాంతో దేశంలోని అన్ని వర్గాల విద్యార్థులు ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో దువుకుంటున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాలోనే తమ పాఠశాలలను నెంబర్ వన్ స్థానంలో నిలపడానికి కృషి చేస్తామని వెల్లడించారు.

అలాగే ప్రభుత్వ గెజిటేడ్ హెడ్ మాస్టార్లు సైదిరెడ్డి, సుగుణ, నిరంజన్, శ్రీలత, సత్యనారాయణరాజు, ఝాన్సీరాణి తది తరులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందని, వారికి ఉత్తమ బోధనలు అందచడానికి బాధ్యతగా విధి నిర్వాహణ కొనసాగించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. క్రమ శిక్షణ కలిగిన ఉపాధ్యాయుల వద్ద చదువుకునే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యావంతు లుగా మారడం ఖాయని వారు పేర్కొన్నారు.

టిపియుఎస్ రాష్ట్ర నాయకుడు హన్మంతరావు, టిఎస్ యుటిఎఫ్ నాయకుడు వెంకటప్ప, ఎస్ఎఫ్ నాయకుడు జనార్ధన్, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దస్తగిరి ఖాన్, యుటిఎఫ్ నాయకుడు యాదగిరి తదితరులు ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసువెళ్లి పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తున్నాయన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలతో పాటు ప్రభుత్వ పాఠశాలల పెరిగిన విద్యార్థుల సంఖ్యలకు అనుగుణంగా కొత్త పోస్టులు మంజూరీ విషయంలో ముఖ్యమంత్రికి ఇప్పటికే వివిధ రూపాల్లో సమస్యను వివరించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకరాచారి, శ్రావణ ్కుమార్, ఆనంద్, నర్సింహారెడ్డి, కోశాధికారి ఎస్ఆర్. రజినీకాంత్, ప్రతినిధులు రాజు, కరుణాకర్, బాబురావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుదర్శన్, వెంకటయ్య, బాలకృష్ణ, అబ్దుల్ రహమాన్, ఎండి. మాజీద్, శివరాం, కె. రత్నారెడ్డిలతో పాటు అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న రాజీవ్ చంద్రశేఖర్ రామచంద్ర రావు, శ్రీనివాస్ రెడ్డి, బుక్క వేణుగోపాల్.



# తెలంగాణలో బిజెపిదే అధికారం

**- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్**

**శంషాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అతి పెద్ద పార్టీగా అవతరించి అధికారంలోకి రాబోతున్నదని కేంద్ర మాజీ మంత్రి బిజెపి జాతీయ నాయకుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు.

భార తీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం శంషాబాద్ మండలంలోని పెద్ద గోల్కొండ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని బిజెపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు అనగోనే భాస్కర్ గౌడ్ భార్య గీతకు అందజేసిన అనంతరం సంఘీగూడలోని బిజెపి నాయకుడు కొత్త శ్రీకాంత్ రెడ్డి నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రపంచంలోనే భారతీయ జనతా పార్టీ అతిపెద్ద పార్టీగా ఆవిర్భావించిందని అన్నారు. రాబోయే ఎన్నికల నాటికి తెలంగాణలో అతిపెద్ద పార్టీగా అవతరించి అధికారాన్ని చేపడుతుందని ఆయన ఆసక్తి చేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలు మరింత దృఢ సంక ల్పంతో పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని సూచించారు. భారతదేశంలో ఎన్నడూ లేని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రతి కుటుంబానికి చేరే విధంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగిందని వివరించారు.

దేశానికి సురక్షితమైన పాలన అందించడం బిజెపికే సాధ్యమైతుందని ప్రతి ఒక్కరు దీనిని గమనించి బిజెపి సభ్యత్వం తీసుకొని పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు. జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి. రాజేంద్రనగర్ నియోజకవర్గం పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీని వాసరెడ్డి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేంద్రనగర్ నియోజక వర్గం నాయకుడు బుక్క వేణుగోపాల్. మండల మాజీ వైస్ ఎంపీపీ పంతంగి రాజుభూపాల్ గౌడ్. మండల బిజెపి అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ కొమురయ్య. కొత్త నారాయణరెడ్డి . . మల్లేష్ యాదవ్.అనగోనే భాస్కర్ గౌడ్. వెంకటేష్ గౌడ్. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రౌడీ పాలన సాగుతుంది

**రాజేంద్రనగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి**

**కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి..**

**తొమ్మిది నెలలల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అన్ని రంగాల్లో నాశనం చేసింది..**

**రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రశ్నించిన వారందరిపై దాడులు చేస్తుంది**



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రౌడీ పాలన సాగుతుందని, ఎమ్మెల్యేకే రాష్ట్ర రాజధానిలో రక్షణ లేకపోతే సామాన్య ప్రజల సంగతేమిటని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ...గత కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఎన్నడూ ఇలాంటి సంఘటనలు చూడలేదన్నారు. కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అరికపూడి గాంధీ అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

తొమ్మిది నెలలల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణను అన్ని రంగాల్లో నాశనం చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నేడు ప్రశ్నించిన వారందరిపై దాడులు,కేసులతో భయపెట్టా లని చూస్తుందని,తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా ఇలాంటి వాటికి అదిరేది బెదిరేది లేదన్నారు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్భంధంలో ఉంచి అరికెపూడి గాంధీ గూండాలతో దాడి చేయిస్తారా అని ప్రశ్నించారు.

ఇది పూర్తిగా పోలీసుల వైఫల్యమేనని చెప్పారు. రాష్ట్ర డీజీపీ వెంటనే దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఎమ్మెల్యే గాంధీ వాడిని పరుష పదజాలంపై చర్యలు తీసుకొని పోరెడ్డి ధర్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఇత రులకు నీతులు చెప్పుడు కాదని, తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అప్రజాస్వామిక పాలనపై స్పంచించాలని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులకు స్థానం లేదని స్పష్టం చేశారు. పాడి కౌశిక్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంటారని స్పష్టం చేశారు.

## గణేశ్ మండపాల వద్ద అన్నదానాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని 16వ వార్డు పరిధిలోని రెవెన్యూ కాలనీలో గల శ్రీభీమలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గణేష్ మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాత మధు ముదిరాజ్ ప్రారంభించారు. అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని ఆయన అన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, భీంనగర్ ప్రజలు, రెవెన్యూ కాలనీ యూత్ పాల్గొన్నారు.







# అభివృద్ధిలో కార్యదర్శులు కీలకం

## - ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల నియోజకవర్గంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇతర ప్రాంతాలకు బదిలిపై వెళ్లడంతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చొరవ బదిలీపై వెళ్లిన వారిని గద్వాల నియోజకవర్గానికి బదిలీ చేయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ని పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు చురుగ్గా చేపట్టాలన్నారు. అధికారులు గ్రామాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అనంతపురం శివాలయంలో ఘనంగా వినాయకుడి పూజలు

## - భక్తమండలి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు

**గద్వాల, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** గద్వాల మండలం అనంతపురం గ్రామం తీగలపల్లి శివాలయంలో విఘ్నేశ్వరుడి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. భజన మండలి ఆధ్వ



అనంతపురంలో విఘ్నేశ్వరుడి పూజల్లో భక్త మండలి'

ర్యంలో నెలకొల్పిన విగ్నేశ్వరుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, ఉత్తమ టీచర్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు సన్మానం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** అంకితభావంతో పని చేస్తేనే ఉపాధ్యాయులకు గుర్తింపు వస్తుందని ఎల్ఎఫ్ఎల్ యోగేందర్ అన్నారు. బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు, బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు ధరూర్ జెడ్పీహెచ్ ఎస్ లో కాంప్లెక్స్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చేసిన సేవలను వారు కొనియాడారు. ధరూర్ నుండి మన్నాపురం ప్రభుత్వ స్కూల్ కి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మురళి, కుర్వవీది పాఠశాల నుంచి సిపిఎస్ ధరూర్ కు బదిలిపై వెళ్లిన ఉపాధ్యాయురాలు కళ్యాణి, ధరూర్ ప్రాథమిక



పాఠశాల నుంచి హరి జన చేరి ప్రభుత్వ పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్నను సన్మానించారు.

### ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుల మీదుగా ఉత్తమ అవార్డు అందు కున్నారు. ఈమేరకు ధరూర్ మండల కేంద్రంలో ఎల్ఎఫ్ఎల్ యోగేందర్ ఆధ్యక్షతన బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయురాలు కళ్యాణిని ఉపాద్యాయులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జాంపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రేవతి, ఉపాద్యాయులు మంజుల, రుఖియా, రాఫియా , ఫాతిమా, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో రౌడీల పాలన

## పోరాడి సాధించుకున్న తెలంగాణలో అస్తవ్యస్త పాలన

## కౌశిక్ రెడ్డిపై దాడిని ఖండించిన అరుణ్ ముదిరాజ్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** పోరాడి సాధించుకున్న సొంత రాష్ట్రం తెలంగాణ లొ., మళ్ళీ ఆంధ్ర నాయకుల పెత్తనం మొదలయ్యిందని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్దేవపల్లి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు సి అరుణ్ మదిరాజ్ ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే పైడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడానికి ఆయన తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ... గుంపు మేస్త్రి ఆధ్వర్యంలో తెలంగాణ మళ్ళీ మొదలైన ఆంధ్ర నాయకుల జులుం ఏంటని ప్రశ్నించారు. రౌడీలతో హైదరాబాద్‌లో జులూస్ చేస్తున్న ఆంధ్ర ఎమ్మెల్యే గాంధీ స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు సి.అరుణ్ ముదిరాజ్

గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నడి బొడ్డున ఆంధ్ర ఎమ్మెల్యే గాంధీ అరాచకం దుర్మార్గమైన చర్య అన్నారు.. గత తొమ్మిది ఏళ్లుగా నోరు మెదపని ఆంధ్ర పెత్తం దార్లు ప్రస్తుతం గుంపు మేస్త్రి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారు.... దొంగ చేతికి తాళం, గుంపు మేస్త్రి చేతిలో తెలంగాణ ప్రజలు అన్యాయానికి గురవుతున్నారన్నారు.



బిజెపి రూరల్ జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డితో న్యాయవాదులు,



కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో న్యాయవాదులు

## కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమక్షంలో

# బిజెపిలో చేరిన జిల్లా న్యాయవాదులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** రంగారెడ్డి జిల్లా ఎల్.బి.నగర్ కోర్టు న్యాయవాదులు మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమక్షంలో పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీలో చేరి సభ్యత్వాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మెంబర్ షిప్ ప్రోగ్రామ్ ఛైర్మెన్ , మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు సామ రంగారెడ్డి , రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యాక్షులు నరసింహ రెడ్డి, బిజెపి స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ అడ్వకేట్ జి.రామారావు , సీనియర్ అడ్వకేట్ పీఠం ప్రదీప్ కుమార్, బీజేవైఎం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు

కొంగళ్ళ నవీన్ , సుదర్శన్ ముదిరాజ్, రాజేంద్రనగర్ అసెంబ్లీ లీగల్ సెల్ అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, రాజేంద్ర నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

**హైదరాబాద్, సెప్టెంబరు 12(నమస్తే ఉదయం):** కమ్యూనిస్టు విప్లవ నేత మార్క్సిస్టు పార్టీ ముద్దుబిడ్డ తెలుగు తేజం ఆచరణశీలి ఉద్యమ కెరటం ఆదర్శ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీలకు సోషలిస్టులకు దేశ ప్రజలకు తీరని లోటని సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి, తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జర్పుల శివ నాయక్, భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బండ యాదమ్మ యాదవ్, సిపిఐ నేతలు గాజర్ల శ్రీనివాస్ గాజర్ల సాయికిరణ్ పేర్కొన్నారు. గురువారం జిల్లలగూడలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి గల నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ విదేశాలలో అనేక కమ్యూనిస్టు పార్టీలు కామ్రేడ్ సీతారాం ఏచూరి ని ఆహ్వానించి వారి విలువైన సూచనలు సలహాలు స్వీకరించే వారన్నారు. ఏచూరి సూచనలు దేశం పరిస్థితులను వివరించి ఆ దేశంలో కమ్యూనిస్టు పార్టీ చేయవలసిన కృషి గురించి అడిగే వారన్నారు.

ఆ దేశంలో కమ్యూనిస్టు పార్టీ చేయవలసిన కృషి కర్తవ్యం గురించి ఆయన కూలంకషంగా వివరించేవారని



గుర్తు చేశారు. జాతి ఐక్యత కోసం కులం మతం తారతమ్యం లేని అసమానతలు లేని సమ సమాజం కోసం సోషలిజం కోసం నిరంతరం పరితపించిన సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టు వామపక్ష ప్రజా సంఘాలు వారి లక్ష్యమైన సోషలిజాన్ని సాధించేవరకు పోరాడుతూనే ఉంటారని కామ్రేడ్ సీతారాం ఏచూరికి విప్లవ జోహార్లు తెలుపుతూ ఘన నివాళులు అర్పించారు.

# మానవత్వం చాటుకున్న యువ నాయకుడు గరుగురాజు ముదిరాజ్

## -సొంత నిధులతో చిలుకూరు ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ

**మొయినాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే ఉదయం):** మండల పరిధిలోని చిలుకూరు ప్రైమరీ స్కూల్లో దుస్తుల పంపిణీ విద్యార్థుల బంగారు భవిష్యత్తే తమ ప్రధాన లక్ష్యమని గరుగు రాజు ముదిరాజ్ అన్నారు. గురువారం చిలుకూరు గ్రామంలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు గరుపు రాజు ఆయన సొంత నిధులతో ఉచితంగా ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు దుస్తుల పంపిణీ నిర్వహించారు అనంతరం ఆయన పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యార్థులు ఎదురుకొంటున్న సమస్యలలను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



దుస్తుల కొరత ఉందని చెప్ప డంతో సానుకూలంగా స్పందించి నేను విద్యార్థులకు దుస్తుల పంపిణీ చేశారు.

దుస్తులతో పాటు ఎలాంటి సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని అన్నారు ఈ సందర్భంగా, యువ నాయకుడు గరుకు రాజు ముదిరాజ్, మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నేను కృషి చేస్తానని తెలిపారు.


విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి గొప్ప ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులను సరైన మార్గంలో నిలబెట్టే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. విద్యార్థులకు తమ వంతుగా అండగా నిలుస్తానని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు ముందు కూడా కూడా చేశానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు జెకరయ్య , రాజశేఖర్, ప్రభాకర్ రెడ్డి, గరుగు రాజశేఖర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి పోలీసు స్టేషన్ నుంచి పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ విడుదల



**గండిపేట్,సెప్టెంబర్ 12(నమస్తే ఉదయం):** పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ స్టేషన్ బెయిల్‌పై నార్సింగ్ పోలీస్ స్టేషన్ నుంచి విడుదలయ్యారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు దానం నాగేందర్,కాలే యాదయ్య,టి.ప్రకాశ్‌గౌడ్ తదితరులు గాంధీకి సంఘీభావం తెలిపారు.పోలీసులు ఇచ్చిన 41 నోటీసుకు వివరణ ఇచ్చినట్టు గాంధీ తెలిపారు.

"నన్ను ఆహ్వానిస్తేనే కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లా..కానీ, మాపై దాడి చేశారు.కౌశిక్ భార్య విల్లాపై నుంచి కుండీ,మొక్కలు మా కార్యకర్తలపై విసిరేశారు. 40 మంది నన్ను అడ్డుకున్నారు.ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు కౌశిక్ ప్రయత్నించారు.నన్ను ఆంధ్రా వాడు అన్నారు.అదే భారాస విధానమైతే ఆ పార్టీ నాయకత్వం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. లేకపోతే పార్టీ అధినేత కేసీఆర్..కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి" అని గాంధీ డిమాండ్ చేశారు.



# అసమానతలు లేని సమాజాన్ని ఆకాంక్షించిన యోధుడు ఏచూరి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 12 (నమస్తే ఉదయం):**

ఆర్థిక సమానతలు అంతరాలు లేని సమాజాన్ని ఆకాంక్షించి ఆ ఆశయాల కోసం చివరి శ్వాస వరకు ఉద్యమించిన పోరాట యోధుడు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి అన్నారు గురువారం గద్వాలలోని సిపిఎం జిల్లా కార్యా లయంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందడం ఎంతో బాధకరమన్నారు. చదువుకున్నప్పటి నుంచే విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొంటూ ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా



పనిచేసి విద్యారంగ సమస్యల పరిష్కారం పోరాడుతూ అనేకసార్లు జైలు జీవితం అనుభవించారని తెలిపారు.

ప్రతిష్టాత్మక యూనివర్శిటీలలో బంగారు పతకాలు సాధించిన ఉన్నత ఉద్యోగ అవకాశాలు వచ్చిన వాటన్నింటినీ కాదని తన జీవితాంతం పీడత ప్రజల పక్షాన పోరాడారని కొనియాడారు. తన జీవితాంతం అంతరాలు లేని ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం పరితపించారని తెలిపారు. 2004లో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు లేని సందర్భంగా సిపిఎం పార్టీ నుండి ప్రజల ఉపాధి ని పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆర్థిక సాధికారత చేకూర్చే ప్రతిపాదనలు పంపారని తెలిపారు అందులో ప్రధానంగా అటవీ హక్కుల చట్టం గ్రామీణ ఉపాధి హామీ చట్టం సమాచార హక్కు చట్టం జాతీయ ఆహార భద్రత చట్టం వంటి చట్టాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారని తెలిపారు సంపదను వికేంద్రీకరించి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించవచ్చని ఆ దిశగా ప్రభుత్వాలపైన ఒత్తిడి చేశారని తెలిపారు.

తన జీవితాంతం పార్టీ నియమాలు సిద్ధాంతాలకు అనుగుణంగా నిజాయితీ నిబద్ధతతో వ్యవహరించారని నిరా డంబర జీవితాన్ని గడుపుతూ పార్టీ కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, నర్మద, కార్మికులు రామకృష్ణ ,సీతారాం, ఆంజనేయులు, చంద్రు, గణేష్, కృష్ణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733